
వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో
కడప నుంచి పెండ్లిమర్రి వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై పెరిగిన కంపచెట్లు

ప్రజాధనం దుర్వినియోగానికి నిలువెత్తు నిదర్శనం ఈ కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు. 2008-09లో ఈ రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదముద్ర తెలిపింది. 2010 సెప్టెంబరు 1వ తేదీన ప్రాజెక్టు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8కి.మీ మేర రైల్వేలైన్ పూర్తయింది. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండ్లిమర్రి రైల్వేస్టేషన్ సైతం నిర్మించారు. దాని తర్వాత ఈ ప్రాజెక్టు పనులు ముందుకు కదలడం లేదు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో గత ఐదేళ్లూ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ రైల్వే మార్గం అంతా కంపచెట్లు పెరిగిపోయాయి.

కడప-బెంగళూరు రైల్వేలైన్ కలేనా..?

- రాయచోటి మీదుగా బెంగళూరుకు..
- నాలుగు దశల్లో పనులకు శ్రీకారం
- రూ.317 కోట్లతో మొదటి దశ పూర్తి
- వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో..
- మిగతా పనులకు బ్రేక్
- ట్రాక్ పొడవునా పెరిగిన కంపచెట్లు

పెండ్లిమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప-బెంగళూరు రైల్వేలైన్ దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి. 268 కి.మీ. మేర చేపట్టాలనుకున్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం అప్పట్లో రూ.1784.64 కోట్లు. ఈ రైల్వే లైన్ నిర్మాణం ద్వారా కడప-బెంగళూరు మధ్య దూరం తగ్గుతుంది. ఈ లైను వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా వాసులకు హైటెక్ నగరమైన బెంగళూరును మరింత చేరువ చేస్తుంది. దూరం తగ్గించడమే కాక అదొక అదనపు మార్గంగా నిలుస్తుంది. ఏపీలోని వెనుకబడిన జిల్లాలైన ఉమ్మడి కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటకలోని కోలార్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతాల నుంచి సరుకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

నాలుగు దశల్లో పనులు..

కడప-బెంగళూరు రైల్వే లైన్ పనులు నాలుగు దశల్లో పూర్తిచేయాలని నాడు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం రైల్వే మార్గం 268 కి.మీ కాగా.. ఇందులో 217.60 కి.మీ మన రాష్ట్రంలోని గుంతకల్ డివిజన్ పరిధిలో ఉంది. మిగతా 50.40 కి.మీ. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండవ దశలో పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా వాల్మీకిపురం వరకు పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే మూడో దశలో వాల్మీకిపురం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మదగట్ట వరకు, నాలుగో దశలో ముల్బాగల్ మీదుగా కోలార్-బంగారుపేట రైల్వే లైన్లో కలిసేలా ఈ రైలు మార్గాన్ని సిద్ధం చేశారు.

50-50 భాగస్వామ్యంతో..

కడప-బెంగళూరు రెల్వే ప్రాజెక్టును 50-50 భాగస్వామ్యంతో పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పట్లో ఒప్పందం చేసుకున్నాయి. పనులు ప్రారంభించేటపుడు రూ.40కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుకు 1531 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇందులో 1250 హెక్టార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మగతా 281హెక్టార్లు కర్ణాటక రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. 54 పెద్ద బ్రిడ్జిలు, 315 చిన్న బ్రిడ్జిలు నిర్మించాలని, 18 క్రషింగ్ స్టేషన్లు, 13 హార్డ్ స్టేషన్లు నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎంతో ఘనంగా అంచనాలు తయారుచేసి పనులు ప్రారంభించారు.

ఐదేళ్లు వదిలేసిన జగన్

కడప-బెంగళూరు రైల్వే మార్గం అనేది అప్పటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కల. ఆయన మరణానంతరం కూడా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, తర్వాత విభజిత రాష్ట్రానికి మొట్ట మొదటి సీఎం అయిన చంద్రబాబు సైతం ప్రతి ఏడాది బడ్జెట్లో ఎంతో కొంత నిధులు కేటాయిస్తూ వచ్చారు. దీంతో మొదటి దశ అయిన కడప నుంచి పెండ్లి మర్రి వరకు రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8 కి.మీ పూర్తి చేశారు. పెండ్లిమర్రిలో రెల్వేస్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం కొలువుదీరిన జగన్ ప్రభుత్వం ఈ రైలు మార్గాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. ఒక్క ఏడాది కూడా బడ్జెట్‌లో ఒక్కరూపాయి కేటాయించ లేదు. దీనికితోడు అధికారం చేపట్టిన మూడేళ్ల తర్వాత కడప-బెంగళూరు రైల్వేమార్గం వద్దంటూ ముద్దనూరు పులివెందుల మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయండి అని కేంద్రమంత్రికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా నిధులిస్తేనే పనులు వేగవంతమవుతాయని కేంద్రం చెబుతోంది. రైల్వేలైన్ నిర్మాణం ఆలస్యం జరుగుతున్న కొద్దీ వ్యయం కూడా పెరుగుతోంది. ప్రస్తుత నిర్మాణ వ్యయం రూ.3037కోట్లకు పెరిగింది.

రూ.317 కోట్లు కంపచెట్లపాలు

కడప-బెంగళూరు రైల్వేమార్గం పనులు మొదటి దశలో భాగంగా రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8కి.మీ రైల్వేట్రాక్ ఏర్పాటు చేశారు. దీనిని టీడీపీ హయాంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 16 జూన్ 2017 నాటికి పూర్తి చేశారు. పెండ్లిమర్రిలో రెల్వేస్టేషన్ కూడా కట్టారు. అంతే.. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ రైల్వేట్రాక్ పొడవునా కంపచెట్లు పెరిగిపోయాయి. పట్టించుకునేవారు లేకపోవడంతో పెండ్లిమర్రి రైల్వేస్టేషన్ సైతం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం పెండ్లిమర్రి వరకు ఏర్పాటుచేసిన రైల్వేలైన్ చిట్టడివిని తలపిస్తోంది. ప్రజాధనం రూ.317 కోట్లు నిరుపయోగం కావడంతో పాటు బెంగళూరుకు రైల్వేలైను ఏర్పాటు కాకపోవడంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో ఇప్పుడు ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అయినా ఈ కడప-బెంగళూరు రైల్వేప్రాజెక్టును పూర్తిచేయాలని కడప, అన్నమయ్య జిల్లా వాసులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న రైల్వే సామాన్లు


వైసీపీ హయాంలో ఇలా..


చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో 16జూన్2017నాటికి నిర్మాణం పూర్తయిన పెండ్లిమర్రి రైల్వేస్టేషన్


జగన్ ఐదేళ్ల పాలనలో నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచి శిథిలావస్థకు చేరిన పెండ్లిమర్రి రైల్వేస్టేషన్


2017లో టీడీపీహయాంలో రైల్వేట్రాక్ ఇలా..

మట్కా దందాలో.. పోలీసుల చేతివాటం

- రూ.5 లక్షలకు బేరం.. రూ.2 లక్షలకు సెటిల్‌మెంట్
- పూచీపడిన అధికార పార్టీ నేత
- స్టేషన్లలోనే సెటిల్‌మెంట్ వ్యవహారాలు
- ఎస్పీ దృష్టి సారించేనా..

ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో మట్కా దందా చాపకింద నీరులా సాగుతోంది. కొందరు మట్కా నిర్వాహకులు పట్టుబడినా వారి నుంచి భారీగా ముడుపులు తీసుకుంటూ పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మట్కాను రూపుమాపాల్సిన పోలీసులు వారితో మిలాఖత్ అయ్యి కేసులో 41ఏ కింద నోటీసులు ఇచ్చి వారిని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు పోలీసులు కేసులు పెడితే మట్కా బీటర్లు ఊర్లు విడిచిపెట్టి వెళ్లేవారు. పోలీసులు కూడా నగర బహిష్కరణ చేసేవారు. కానీ నేడు మట్కా నిర్వహిస్తు పట్టుపడ్డా దర్జాగా పోలీసు స్టేషను నుంచి చొక్కా నలగకుండా వెళుతున్నారు. వివరాలు ఇలా..

ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఒక పోలీసు స్టేషన్లో శుక్రవారం ఇద్దరు మట్కా బీటర్లను పట్టుకున్నారు. మట్కా పట్టీలు, డబ్బులు ఎవరికి ఇస్తున్నారని విచారించారు. కమలాపురం నియోజకవర్గంలోని ఒక గ్రామంలో మట్కా కంపెనీ నిర్వహిస్తున్న వ్యక్తికి ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి అతడిని పట్టుకొచ్చారు. అతని వద్ద ఉన్న రూ.25వేల నగదును సీజ్ చేసి తెచ్చారు. ఆ తరువాత వీరిని వదిలిపెట్టమని అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు పోలీసులకు సిఫారసు చేశారు. వీరిని వదిలిపెట్టడానికి స్టేషన్లోని ఒక డబుల్ స్టార్ అధికారితో పాటు ఒక సింగిల్ స్టార్ అధికారి కలిసి రూ.5 లక్షలు డిమాండ్ చేశారని ప్రచారం సాగుతోంది. చివరకు రూ.2 లక్షలకు సెటిల్‌మెంట్ అయినట్లు ఆ స్టేషన్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ముగ్గురిపై మట్కా కేసు పెట్టి రూ.82,100 స్వాధీనం చేసుకున్నట్టు కేసు రాశారు. కానీ స్వాధీనం చేసుకున్నట్టు చెబుతున్న డబ్బుతో పాటు సెటిల్‌మెంట్ అయిన మొత్తం అధికార పార్టీ నేత పూచీ పడటంతో వారిని వదిలేశారని చెబుతున్నారు. ఇప్పటికీ కేసులో చూపెట్టిన నగదు మొత్తం పోలీసు స్టేషన్లో లేదని సమాచారం. ఈ వ్యవహారం స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి సైతం వచ్చిందని సమాచారం. ప్రొద్దుటూరులో మట్కా జూదం క్రికెట్ బెట్టింగ్‌ను అరికడతానని వాటిని నిర్వహించే వారిని ఊర్లో ఉండనివ్వనని ఆయన ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ప్రొద్దుటూరులో అన్ని స్టేషన్ల పరిధిలో మట్కా నిరాటంకంగా సాగుతోంది. దీనిపై ఉక్కుపాదం మోపవలసిన పోలీసు అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకుంటూ తమ జేబులు నింపుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికైనా సబ్‌డివిజనల్ అధికారి, జిల్లా పోలీసు అధికారి ప్రొద్దుటూరులో జరిగే అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, జేబులు నింపుకునే అధికారులను ఇక్కడి నుంచి పంపించి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రియాంక గెలుపు హర్షణీయం

- తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాయనాడ్ ఉప ఎన్నికలలో ప్రియాంక గాంధీ, జార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రియాంకా గాంధీ గెలుపు భవిష్యత్ భారత రాజకీయాలలో ఒక మలుపు అని తులసిరెడ్డి అన్నారు. జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి మళ్లీ అధికారంలోకి రావడం, గతానికంటే ఎక్కువ సీట్లు రావడం మార్పునకు సంకేతమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, అరుసేర్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు కడితేనే కరెంటు

- ఎస్సీ కాలనీకి విద్యుత్తు కట్ చేసిన అధికారులు



విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

జమ్మలమడుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు వెనుక భాగాన ఉన్న ఎస్సీ కాలనీ వాసులు బిల్లులు చెల్లించలేదంటూ శుక్రవారం రాత్రి చెప్పా పెట్టకుండా అధికారులు విద్యుత్తు సరఫరా నిలిపివేవారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 9గంటల నుంచి విద్యుత్తు అధికారులు ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ విద్యుత్తు బకాయిలు ఎంతెంత ఉన్నారు అనేది పరిశీలించారు. కట్టకపోతే కరెంటు సరఫరా పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఎస్సీ కాలనీకి విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నారని, గత ప్రభుత్వంలో తమకు బిల్లులే అడగలేదని కొందరు మహిళలు తెలిపారు. వెంటనే అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ.. బిల్లులు ఒక్కొక్కరు రూ.5 వేలకు పైగా బాకీ ఉన్నారని, కరెంటు బిల్లు తప్పనిసరిగా కట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. అక్కడున్న ఓ మహిళ డబ్బులు ఇప్పటికిప్పుడు అడిగితే ఏమి చేయాలని ప్రశ్నించడంతో.. సిబ్బందిలో ఒకరు నాలుగు ఇళ్లకు వెళ్లి తెచ్చుకోవాల్సిందేనని చెప్పారు. దీంతో మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరికొందరు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ఫోన్ చేసి అక్కడే ఉన్న విద్యుత్తు ఏఈ రజనీకాంత్‌కు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న బకాయిలలో ఎవరు ఎంత ఇచ్చినా తీసుకొని వెళ్లి తర్వాత అప్పుడప్పుడు వసూలు చేసుకోవాలని, ఉన్నట్లుండి విద్యుత్తు తొలగించి డబ్బులు కట్టాల్సిందేనంటే పేద ప్రజలు ఇబ్బంది పడుతారని ఆయన చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. దీనిపై విద్యుత్తు ఏఈ రజనీకాంత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బకాయిలు వసూలు చేస్తున్నామన్నారు.

ప్రొద్దుటూరు కోర్టుకు వర్రా రవీంద్రరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ సోషయల్ మీడియా కు చెందిన వర్రా రవీంద్రరెడ్డిని శనివారం ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు పీటీ వారంట్ పై ప్రొద్దుటూరు రెండవ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై అసభ్యకర పోస్టులు పెట్టినందుకు ఈనెల 5 తేదీన ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ కేసు నిమిత్తం పీటీ వారంట్‌పై పులివెందులలో మరో కేసుకు సంబంధించి కడప సెంట్రల్ జైలులో ఉన్న వర్రా రవీంద్రారెడ్డిని ప్రొద్దుటూరుకు తీసుకు వచ్చారు. ప్రొద్దుటూరు కోర్టులో విచారణ అనంతరం తిరిగి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

చేయి తడిపితేనే..!



- లేదంటే ఇంక్రిమెంట్లు, అరియర్స్ పెండింగ్
- ఆర్టీసీ కడప డిపోలో ఆ హెడ్‌క్లర్క్ రూటే సెపరేట్
- పట్టించుకోని పైస్థాయి అధికారులు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

కడప మారుతీనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కడపలో ఉన్న ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, అరియర్స్ రావాలంటే.. అక్కడ పనిచేసే ఓ హెడ్‌క్లర్క్ చేయి తడపాల్సిందే. లేదంటే పెండింగ్‌లో పడిపోతుంటాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డిపోల కంటే కడప డిపో ద్వారా ఎక్కువ ఆదాయం ఉంటుంది. బస్సుల ద్వారా ప్రయాణికులను, వివిధ వస్తువులను పార్శిల్ ద్వారా చేరవేయడంతో సైతం ఎక్కువ ఆదాయం సమకూర్చుకుంటోంది.

ప్రయాణికుల సేవలో తరించే కడప డిపో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సంబంధించిన ఆఫీసులో పనిచేసే మిగతా ఉద్యోగులందరికీ ఇంక్రిమెంట్లు, అరియర్స్, సిక్‌లీవులు, అందడం పరిపాటి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, అరియర్స్ తదితర ఇతర సౌకర్యాలను సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత కడప డిపోలో సంబంధిత డిప్యూటీ సూపరింటెండెంట్ (హెడ్‌క్లర్క్)గా విధులు నిర్వహించే ఉద్యోగి చేయాల్సి ఉంది. అయితే.. ఇవన్నీ ఉద్యోగులకు సకాలంలో అందాలంటే ఆ హెడ్‌క్లర్క్ చేయి తడపాల్సిందేనని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. చేయి తడిపిన వారికి మాత్రమే చకచకా అవి అందుతున్నాయని, మిగతా వారికి అవి అందని ద్రాక్షలాగా మారాయని వాపోతున్నారు. కడప డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న కొంతమంది రీజియన్ స్థాయిలో ఏఏఎస్ (ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్) టెస్ట్ పాసైనప్పటికీ వారికి ఇంక్రిమెంట్స్ నాలుగు నెలలుగా వేయకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. ఇదేమని ప్రశ్నించిన ఆ డ్రైవర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. అనారోగ్యంతో ఎవరైనా సిక్‌కు గురైతే.. నచ్చిన వారికి జీతం ఇస్తారని నచ్చని వారికి జీతంలో కోతపెడుతున్నారని పలువురు వాపోతున్నారు.

పనిచేయకున్నా..

అందరి జీతభత్యాలకు సంబంధించిన సమాచారాన్ని పంపించేది ఆ హెడ్‌క్లర్కే. అంతా తన చేతిలో పనే కదా అనుకున్నారో ఏమో.. తాను పనిచేయకున్నా చేసినట్టు సృష్టించుకుని జీతం తీసుకున్నట్టు తెలిసింది. 17 మే 2024 నుంచి 10 జూన్ 24 వరకూ ఆయన పనిచేయకపోయినా మస్టర్ వేసుకుని జీతం తీసుకున్నారని సమాచారం. ఆ విషయంపై కొంతమంది ఆర్టీసీ ఉద్యోగులు పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకూ చర్యలు లేవు. అంతేకాకుండా మరో అడుగు ముందుకేసి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఓ కడప డిపో డ్రైవర్‌కు గత అక్టోబర్ నెలకు పూర్తి జీతం (రూ.70,508) డ్రా చేసి ఆ డ్రైవర్ తాలూకు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ నేటికీ ఆ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి.

ఆయన వైసీపీతో అంటకాగారు

ఆ హెడ్‌క్లర్క్‌పై అంతలా ఆరోపణలున్నా చర్యలు తీసుకోకపోవడానికి ప్రధాన కారణం అతను గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ చైర్మన్ దగ్గర పీఏగా సేవలందించడమే అని తెలుస్తోంది. అప్పట్లో కూడా హెడ్‌క్లర్క్‌పై పలు ఆరోపణలు, అభియోగాలు కరపత్రాల రూపంలో వచ్చినా అధికారుల్లో ఏ మాత్రం చలనంలేదు. అప్పటి నుంచి ఆయన మరింత రెచ్చిపోతున్నారని అంటున్నారు. ఆర్టీసీలో క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారం ఆ హెడ్‌క్లర్క్ మైదుకూరు డిపోలో పనిచేయాల్సి ఉంది. కానీ తన పలుకుబడితో కడపడిపోలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని మైదుకూరుకు బదిలీ చేయించి ఆయన ఇక్కడ చక్రం తిప్పుతున్నారనే అభియోగాలున్నాయి. ఎలాంటి అర్హతలేని ముగ్గురు (ఇద్దరు కండక్టర్లు, ఒక శ్రామిక్) ఉద్యోగులను కడప డిపోలో ఓడీ (ఔట్ ఆఫ్ డిసిగ్నేషన్) కింద నియమించి ఆయన స్వంత పనులకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ హెడ్‌క్లర్క్ సాగిస్తున్న అవినీతిపై జిల్లా, జోనల్ స్థాయి అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కడప డిపో ఉద్యోగులు కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై కడప డిపో మేనేజర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. గతంలో ఆ హెడ్‌క్లర్క్‌పై కొన్ని అభియోగాలు ఉన్నాయన్నారు. అవి క్లియర్ అయ్యాయని, ప్రస్తుతం అంతా సవ్యంగా ఉందని అన్నారు.

వేల ఏళ్ల.. ఆనవాళ్లు

- శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలు
- ఉమ్మడి జిల్లాలో బృహత్‌శిలాయుగం నాటి సమాధులు

6


సుండుపల్లె మండల పరిధిలోని శేషాచల పర్వతసానువుల్లో 4వేల ఏళ్ల క్రితం నాటి సమాధులు



వేల ఏళ్ల.. ఆనవాళ్లు

శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

చుట్టూ దట్టమైన అడవి. ఆ అడవి మధ్య పద్ధతి ప్రకారం అమర్చిన రాళ్లు. నాలుగు రాళ్లను నిలిపి.. వాటిపైన మూతగా ఓ పెద్ద బండ. అలా పెట్టిన కొన్ని రాళ్ల చుట్టూ.. తామరపూల ఆకారంలో నిలువుగా అమర్చిన బండరాళ్లు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం రాయవరం గ్రామం దేవవాండ్లపల్లె సమీపంలోని ఎర్రకొండల్లో ఇటువంటి నిర్మాణాలున్నాయి. ఆ బండరాళ్ల వెనుక మూడువేల సంవత్సరాలకు పూర్వం మనుషుల జీవన విధానాన్ని తెలిపే చరిత్ర ఉంది. ఆదిమ మానవుడు రాతియుగం నుంచి అభివృద్ధి చెందుతూ.. ఇనుమును వినియోగించిన కాలం (బృహత్ శిలాయుగం) నాటి చరిత్ర అది. అప్పట్లోనే ఇక్కడ జీవించిన మానవులు తమ సమాధులను ఎలా నిర్మించారో నేటి తరానికి తెలియజేసే ఆనవాళ్లే ఆ పెద్దపెద్ద రాతి నిర్మాణాలు. ప్రస్తుతం వీటి ఆలనాపాలనా చూసేవారు లేక.. ప్రభుత్వాలు పట్టించుకోక... గుప్తనిధులు ఉంటాయేమోననే కొందరి దురాశ కారణంగా.. ఆ నిర్మాణాలు ధ్వంసమై శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నాలుగు ఎకరాల్లో.. 50 నిర్మాణాలు

అన్నమయ్య జిల్లాకు ఎంతో ప్రాచీన చరిత్ర, సంస్కృతి ఉన్నాయనడానికి ఈ రాతి నిర్మాణాలే నిదర్శనం. దేవవాండ్లపల్లెకు ఉత్తర దిశలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని శేషాచలకొండల్లోని ఎర్రకొండల్లో ఈ నిర్మాణాలు ఉన్నాయి. పురావస్తు పరిశోధకుల ప్రకారం.. ఇక్కడి రాతి నిర్మాణాలు మూడు వేల ఏళ్ల క్రితం బృహత్ శిలాయుగంలో మరణించిన మనుషుల సమాధులు. అవి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం అన్నీకలిపి 50 వరకు ఉన్నాయి. పూర్వ కాలంలో ఎవరైనా మరణిస్తే.. ప్రత్యేక పద్ధతిలో పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించి సమాధులు నిర్మించే వారు. సాధారణంగా సమాధుల్లో డాల్‌మెన్స్, స్టోన్ సర్కిల్స్, మెన్‌హిర్స్, సిస్ట్‌బరియల్స్, డాల్‌మెనాయిడ్ సిస్ట్ అనే రకాలు ఉంటాయి. దేవవాండ్లపల్లెలోని సమాధులు.. డాల్‌మెన్స్ రకానికి చెందినవి. వీటి నిర్మాణానికి ఆర్కియన్ యుగపు గ్రానైట్ రాయిని ఉపయోగించారు. ఈ సమాధుల్లో మృతదేహంతో పాటు.. ఇనుప పరికరాలు, మట్టి పాత్రలు వేసి పూడ్చేవారు. సమాధుల లోపలి బండలపై ఆనాటి కాలంలో చిత్రించిన తెలుపు రంగులో ఏనుగు, ఏనుగుపై సవారీ చేస్తున్న మనిషి, తాబేళ్లు, డైనోసార్స్‌ను పోలిన రేఖాచిత్రాలు ఉన్నాయి. సమాధుల వద్దకు అడవి జంతువులు వెళ్లడానికి వీలు లేకుండా వాటి చుట్టూ తామరపూవు ఆకారంలో 10నుంచి 15 అడుగుల ఎత్తు ఉన్న పెద్దపెద్ద బండరాళ్లు నిలబెట్టారు. ఈ నిర్మాణాలకు సమీపంలోనే ఉన్న మరో గుట్టపైన శ్లాబ్ ఉన్న డాల్‌మెన్స్ ఉన్నాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వేల సంవత్సరాల నాటి ఈ బృహత్ శిలాయుగపు సమాధులు ఉన్న ప్రాంతాన్ని ఇప్పటికైనా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇవి ఉన్నచోటుకు చేరుకోవాలంటే అడవిలో చాలా దూరం నడవాల్సి ఉంటుంది. అయితే ఈ సమాధులకు ఉన్న చరిత్ర, ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే.. పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ రాతి సమాధులు ఉన్న ప్రాంతం చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాటిని రక్షిస్తే.. భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించే అవకాశం ఉంటుంది.

అన్నమయ్య జిల్లాలో బృహత్ శిలాయుగం నాటి సమాధులు

1914లోనే వీటిని గుర్తించిన ఆంగ్లేయుడు రాబర్ట్ పూటే

పాండవుల గుళ్లుగా పిలుస్తున్న స్థానిక ప్రజలు

బండలపై ఆ కాలం నాటి అపురూప రేఖాచిత్రాలు

పట్టించుకునేవాళ్లులేక ఛిద్రమవుతున్న చారిత్రక సంపద

ప్రభుత్వం చొరవ చూపితే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం

దక్షిణ భారతదేశంలో ఎక్కువ

ప్రాచీన కాలంలో రాతి సమాధుల సంస్కృతి దక్షిణ భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అలాంటి సమాధులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఈశాన్య భారతంలో కూడా కొన్ని చోట్ల ఉన్నాయి. ఉత్తర భారతదేశంలో మాత్రం ఇలాంటి సమాధులు కనిపించవు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా రాయలసీమలోనే ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఉన్న వాటిలో దేవవాండ్లపల్లె వద్ద ఉన్నవే పెద్దవి కావడం విశేషం. సుండుపల్లె మండలం మడితాడు గ్రామం పడమర వైపు చెన్నకేశవ స్వామి దేవస్థానం వెనుక వైపు ఉన్న గుట్టల్లోనూ.. ఇటువంటి రాతి సమాధులు సుమారు 20 వరకు ఉన్నాయి. సంబేపల్లె మండలంలోనూ అక్కడక్కడా కనిపిస్తాయి. చిత్తూరు జిల్లాలోనూ.. ఇటువంటివి పలుచోట్ల ఉన్నాయి. దక్షిణ కర్ణాటక మూడ్‌బిదిరి ప్రాంతంలో.. అచ్చం దేవవాండ్లపల్లెలో ఉన్నట్టే సమాధుల నిర్మాణాలు ఉన్నాయి. అయితే ఎక్కువగా సమాధులు ఉన్నది మాత్రం సుండుపల్లె మండలంలో మాత్రమే. అయితే వీటిలో పాండవులు అజ్ఞాతవాస కాలంలో నివసించారని.. కడప, చిత్తూరు జిల్లా ప్రజల విశ్వాసం. దీంతో వీటిని ఈ జిల్లాల్లో పాండవుల గుళ్లుగా పిలుస్తారు. దేవవాండ్లపల్లె ప్రజలు వీటిని పాండురాజు గుళ్లు అంటారు. ఇలాంటి సమాధుల్లో రాక్షసులు నివసించారని భావించే కర్నూలు, ప్రకాశం జిల్లాల ప్రజలు వీటిని రాక్షస గుళ్లు అని పిలుస్తారు.



మరో బండపై చతురస్రాకారంలో ఉన్న నిర్మాణాలు

అపురూపమైన చారిత్రక సంపద



ఈ కట్టడాలు బృహత్ శిలాయుగం నాటి మానవుల సమాధులు. గతంలో పరిశోధనలు చేసిన వారు ఇవి దాదాపు 3 వేల ఏళ్లనాటివి అని చెప్పారు. అయితే ఇటీవల హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వారు.. ఇలాంటి సమాధుల్లో దొరికిన వాటిని అధునాతన పద్ధతుల్లో పరిశీలించి ఇవి దాదాపు 4,400 ఏళ్లనాటివని తేల్చారు. ఈ సమాధుల బండలపైన రాళ్లను పిండిచేసి అందులో ఆకుపసరులు కలిపి నాటి మానవులు బొమ్మలు గీశారు. ఇవి సహజమైన రంగులు కావడంతో ఇప్పటికీ చెరిగిపోకుండా ఉన్నాయి. ఇలాంటివి దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా రాయలసీమలో ఎక్కువగా ఉన్నాయి. ఈ నిర్మాణాల్లో నిధులేవీ ఉండవు. కొందరు ఈ బండలను పొలాలకు కంచెలకు, ఇళ్లకు వాడుకుంటున్నారు. ఇవి అపురూపమైన చారిత్రక సంపద. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ముఖ్యంగా పురావస్తుశాఖ, రెవెన్యూ వారు వీటిని పరిరక్షించాల్సి ఉంది.

\- జాదవ్ విజయకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, పురావస్తుశాఖ

1914లో వెలుగులోకి..

ఈ సమాధులను మొట్టమొదట 1914లో గుర్తించారు. అప్పటి బ్రిటిష్ పాలనలో రాబర్ట్ బ్రూస్ పూటే అనే ఆంగ్లేయుడు వీటిని మొదటిసారిగా గుర్తించాడు. ఈ మేరకు 'ది పూటే కలెక్షన్ ఆఫ్ ఇండియన్ ప్రి-హిస్టారిక్ అండ్ ప్రోటో-హిస్టారిక్ యాంటిక్విటీస్ కేటలాగ్ రైజాన్ బై మద్రాస్ గవర్నమెంట్ ప్రెస్'లో రికార్డయింది. అనంతరం వీటిని ఎవ్వరూ పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం చరిత్రకారులు కొందరు ఇక్కడికి వెళ్లి వీటిని పరిశీలించారు. అయినా ఇవి పెద్దగా వెలుగులోకి రాలేదు.



శేషాచలకొండల్లోని ఎర్రకొండలో ఒక పెద్ద బండపై తామరపూవు ఆకారంలో ఉన్న రాతికట్టడాలు (సమాధులు)

హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనులు

● డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్



హార్సిలీహిల్స్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

బి.కొత్తకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లోని అటవీ ప్రాంగణంలో పర్యాటకులను ఆకర్షించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. ఇటీవల రూ.10 లక్షలతో ఆధునీకరించిన అతిథిగృహంతో పాటు, ప్రస్తుతం రూ.20 లక్షలతో నిర్మిస్తున్న మరో అతిథిగృహం పనులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని మానససరోవరంలో బోటింగ్ పర్యాటకులను బాగా ఆకర్షిస్తోందని, పర్యాటకుల భద్రతతో పాటు, అతిథి గృహాల అద్దెలను రీజనబుల్‌గా వసూలు చేస్తున్నామన్నారు. జూపార్కులతో పాటు ప్రతిపాదనలు పంపిన పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

అడవి పంది మాంసం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

పెద్దతిప్పసముద్రం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది మాంసాన్ని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముగ్గురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ములకలచెరువు ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ అధికారి షబీస్‌తాజ్, ఫారెస్ట్ బీట్ అధికారి ప్రకాష్‌కుమార్‌లు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లె పంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు, రెడ్డెప్ప, జయచంద్ర అనే ముగ్గురు అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో కాయలవాండ్లపల్లెకు చేరుకుని వారు విక్రయిస్తున్న అడవి పంది మాంసంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని ములకలచెరువు అటవీశాఖకు సంబంధించిన స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వారిని ములకలచెరువులోని అటవీశాఖ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లకు కొత్త నెంబర్లు కేటాయింపు



ములకలచెరువు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లకు రైల్వేశాఖ కొత్త నెంబర్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మారిన రైళ్ల నెంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించింది. తిరుపతి-గుంతకల్లు-కదరిదేవరపల్లెకు రాత్రి, ఉదయం నడిచే నాలుగు రైళ్ల నెంబర్లు మారాయి.

ప్యాసింజర్ రైలు	పాత నెంబరు	కొత్త నెంబరు
1) తిరుపతి-గుంతకల్లు (ఉదయం)	07656	57403
2) గుంతకల్లు-తిరుపతి (ఉదయం)	07655	57404
3) తిరుపతి-కదరిదేవరపల్లె (రాత్రి)	07589	57405
4) కదరిదేవరపల్లె-తిరుపతి (రాతి)	07590	57406

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఫైర్‌స్టేషన్ పక్కన శేషమహల్‌కు వెళ్లేవీధిలో కాపురం ఉన్న నరేష్ భార్య జి.స్వాతి బాత్‌రూమ్‌లో తాడుతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన స్థానికులు వెంటనే వన టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి మహిళను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



బాలగంగాధర్‌నాయుడు, శివ

గాలివీడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్ నాయుడు, కె.శివ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కవారిపల్లె, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సిద్దవటం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గాండ్లపాలెం వద్ద పెన్నానది నుంచి బద్వేల్‌కు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆ వాహనాలను తహసీల్దారుకు అప్పజెబుతామన్నారు. గృహనిర్మాణాలకు మాత్రమే ఉచితంగా ఇసుక రవాణా చేయాలని, దూర ప్రాంతాలకు ఇసుక రవాణా చేయరాదని ఎస్‌ఐ తెలియజేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదైంది. పీటీఎం ఎస్‌ఐ నరసింహుడు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లెకు చెందిన బయ్యారెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా వరికసువుపల్లె సమీపంలోని తుమ్మరకుంట రెవిన్యూ సరిహద్దులో ప్రభుత్వ భూమిలో దహనక్రియలను చేసేందుకు ఆయన కుటుంబీకులు యత్నించారు. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తమ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని దానిని అడ్డుకున్నారు. దీంతో వారిపై మృతుడి కుటుంబ సభ్యులు దౌర్జన్యానికి దిగారు. తమ విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యం చేశారని వరికుసువుపల్లె గ్రామానికి చెందిన ఏడుగురిపై పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టౌన్‌బ్యాంకు నామినేషన్లన్నీ సక్రమమే

● స్క్రూటినీ పూర్తి



నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

మదనపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం స్క్రూటినీ పూర్తి చేశారు. శుక్రవారం 12 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ప్రకటించారు. ఇందులో భాగంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్‌తో పాటు ఆయన ప్యానల్‌లోని నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, సవరం భాస్కర్‌కుమార్, రాటకొండ సోమశేఖర్, దిగువపాళెం నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోళపాళం కృష్ణమూర్తి దేవేంద్రబాబులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులు ఒక్కొక్కరిని పిలుస్తూ వారి ముందు నామినేషన్‌ను నిశితంగా పరిశీలించారు. ఇలా 12 మంది నామినేషన్లను పరిశీలించిన దుర్గమ్మ అంతా ఒకే అంటూ ప్రకటించడంతో అటు అధికారులు, ఇటు అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే పోటీలోని అభ్యర్థులందరూ ఒక్కొక్కటే నామినేషన్ దాఖలు చేయడం, పైగా నిబంధనల ప్రకారం ప్యానల్‌లోని సంఖ్యకు సరిపడా అభ్యర్థులే పోటీపడటంతో నామినేషన్ల ఉపసంహరణ అనే మాట ఉండదు.

తర్వాత ఎన్నికల క్రతువులో పోటీలోని అభ్యర్థులను ఎన్నికల అధికారి దుర్గమ్మ అధికారికంగా ప్రకటించడం, వారి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఇందులో చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్, వైస్‌చైర్మన్‌గా ఎస్.భాస్కర్‌కుమార్‌లను ఎన్నుకోనున్నారు.

పొట్టేళ్లపై చిరుతపులి దాడి



చిరుతపులి దాడిలో గాయపడిన పొట్టేళ్లు

నిమ్మనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి నిత్యం ఏదో ఒక చోట మూగజీవాలపై దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. తాజాగా శనివారం మండలంలోని ముహర్దారు పంచాయతీ పారేసువారిపల్లికి చెందిన రైతు రాజగోపాల్ తన వ్యవసాయ పొలం వద్ద పొట్టేళ్లను మేపుకుంటుండగా చిరుతపులి పొట్టేళ్ల మందపై దాడి చేసి రెండు పొట్టేళ్లను పట్టుకుంది.

వెంటనే అక్కడే ఉన్న రైతు పెద్దగా అరవడంతో వాటిని వదిలి పారిపోయినట్లు తెలిపాడు. కాగా చిరుతపులి బోడికొండ, చలిమామిడికొండ ప్రాంతాలలో తిరుగుతూ కనిపించిన మూగజీవాలను చంపుతోంది. నాలుగు చిరుతలు వాటి పిల్లలు కూడా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో అటవీ ప్రాంత సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకొని మూగజీవాలతో పాటు మనుషుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పీలేరులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పర్యటన



వంటశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ

పీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఏఎస్ పద్మజ శనివారం పీలేరులో విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ఆమె శనివారం స్థానిక ఆయిల్ సీడ్స్‌లోని బాలికల గురుకులం, చిత్తూరు మార్గంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం, కోర్టు ప్రాంగణాలు, సబ్‌జైలును సందర్శించారు. గురుకులాల్లో బాలికలతో మాట్లాడారు. అక్కడ విద్యార్థినులకు అందుతున్న భోజన సదుపాయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ సీడ్స్‌లోని గురుకులంలో వంట శాల నిర్వహణ బాగోలేదని, దానిని సరిచేసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నాదా లేదా అంటూ సబ్‌జైలులోని ఖైదీలను ఆరా తీశారు. శిక్ష అనుభవించిన అనంతరం ప్రవర్తనలో మార్పు రావాలని వారికి హితవు పలికారు. డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహకాల్లో భాగంగా పీలేరు కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సూచించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పీలేరు సీనియర్ సివిల్ జడ్జి రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పల్లెపండుగ పనులు అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటివసతి తదితర అంశాలపై కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఐసీడీఎస్ శాఖాధికారులు, సిబ్బంది, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని, వందశాతం పనులు గ్రౌండింగ్‌లో కావాలని ఎంపీడీవోలను, పంచాయతీరాజ్, డ్వామా శాఖల సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహించి పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈని, డ్వామా పీడీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నీటి వసతి ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారి ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈని, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్‌ఈ దయాకర్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణల పర్వం

మైసూరివారిపల్లెలో వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తున్న వైనం ● రూ. కోట్లు విలువైన భూములు కబ్జా

17 ఎకరాల్లో మిగిలింది 4 ఎకరాలు! ● ఖద్దరుబాబుల అండతో యథేచ్ఛగా సాగుతున్న తంతు

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మైసూరివారిపల్లె పంచాయతీలో ఉన్న వంకపోరంబోకు భూమిని కొందరు ఆక్రమిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి సదరు భూమిని పరిశీలించింది. అక్కడ ఆక్రమణలు కోకొల్లుగా బయటపడుతున్నాయి. రూ. కోట్లు విలువైన భూమిని ఆక్రమిస్తున్నారు. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు దర్జాగా చేస్తున్నారు. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరా ల భూమి ఉండేది. కాలక్రమేణ ఈ భూమి ఆక్రమణలు చేయడంతో కేవలం సుమారు 4 ఎకరా లు మాత్రమే మిగిలింది. మిగిలిన భూమిని కూడా ఆక్రమిస్తున్నారు. కాపాడిన వారే ఆక్రమిం చుకోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మతానికి చెందిన వారికి సుమారు 4 ఎకరాలు కేటాయించారు. ఇది పోను మిగిలిన భూమి కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ భూమికి పక్కనే ప్రధానదారికి ముందు భాగంలో సుమారు ఐదెకరాల భూమిలో ఓ సోప్ పరిశ్రమ ఉండేది. సోప్ పరిశ్రమ మూత పడింది. తర్వాత ఓ నాయకుడు ఆ స్థలాన్ని తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత సోప్ పరిశ్రమ భవనాలను కూల్చి భూమిని చదును చేశారు. ఈ భూమి వెనుక భాగంలోనే వంకపోరంబోకు భూమి ఉంది. ఈ భూమిపై వైసీపీ ప్రభుత్వంలో అనేకులు కన్నే శారు. అయితే జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసు ల అండతో ఆక్రమణల పర్వం చేయాలని చూశారు. మైసూరివారిపల్లె గ్రామస్థులు చాలా సార్లు అడ్డుకున్నారు. ఖద్దరు బాబుల అండతోనే ఆక్రమణలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ తంతు కూటమి ప్రభుత్వం వచ్చినాటి నుంచి మొదలు పెట్టడం, అధికారం మనదే కదా అని ఆక్రమ ణలు చేయడం కొసమెరుపు.



వంకపోరంబోకు భూమిలో కంచె వేసిన ఆక్రమణదారులు

ఉన్నతాధికారులకు నివేదిక

ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులకు నివే దిక పంపినట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. మైసూరి వారిపల్లె వంకపోరంబోకు స్థలంలో ఎవరు ఆక్రమణలు చేశారు, ఎంత వరకు జరిగాయి తదితర అంశాలపైన సర్వే చేయిస్తామని ఆయన వివరించారు.

గండి క్షేత్రంలో రామ్‌దిన్ అన్నదానం

అన్నదాత ఉత్తర్ ప్రదేశ్ వాసి



గండి క్షేత్రంలో అన్నం వడ్డిస్తున్న రామ్‌దిన్

చక్రాయపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామ్‌దిన్ అన్నదానం చేస్తున్నారంటే గండిలో ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భారీఘాట్ బస్తీ వాసి రామ్‌దిన్ రామభక్తుడు. ఏటా కార్తీకమాసంలో గండి దేవస్థానంలో వేలాది మందికి అన్నదానం చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం గండి క్షేత్రంలో 7వేల మందికి అన్నదానం గావించారు. పలు రకాల అన్నం, కూరలు, వడ, బజ్జీలు తదితర వాటిని భక్తులకు వడ్డించారు. ఉదయం 10గంటలకు ప్రారంభించి రాత్రి 8గంటల వరకు అడిగడిగి మరీ అన్నదానం చేశారు. కాగా ఇంకా మూడు అండాల అన్నం మిగిలిపోవడంతో అనాథాశ్రమాలకు తరలించారు. ఈయన దాతృత్వం ఇంతా అంతా కాదు. ప్రతి భక్తుడూ అన్నదాత సుఖీభవ అంటూ దీవించారు. ఏటా శనివారం దాదాపు రూ.2లక్షలకు పైబడి ఖర్చు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, రామ్‌దిన్ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు. మండలంలోని నాగులగుట్టపల్లె సమీపంలోని దశరథ మహారాజ ఆలయం వద్ద అయ్యప్పస్వాములకు అన్నదానం గావించారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

పోరుమామిళ్ల,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అరుణాచలానికి బస్సు సౌకర్యం కలగజేస్తున్నట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటలకు పోరుమామిళ్ల నుంచి నేరుగా అరుణాచలానికి బస్సు వెళుతుందని సోమవారం ఉదయం 5గంటలాకల్ల అరుణాచలం చేరి గిరిప్రదక్షిణ చేసిన తరువాత గోల్డెన్ టెంపుల్ కూడా సందర్శించవచ్చని తెలిపారు. అరుణాచలానికి వెళ్లేవారు 7981554538, 7382865220కి ఫోను చేయాలన్నారు. టికెట్ ఫోను ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఒక టికెట్‌కు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నీ నేడు

కడప స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలోని ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి ఇసతి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.
క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

ప్రతి సంఘం ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఆనంద్‌నాయక్

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి డ్వాక్రా సంఘం ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సంఘం సభ్యులపై ఉందని పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. శనివారం కమలాపురం మండల సమాఖ్య సమావేశ సభ భవనంలో సమాఖ్య ఓబీలు, ఈసీ మెంబర్స్, గ్రామ సమాఖ్య సహాయ సేవకురాళ్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టరు ఆనంద్‌నాయక్ మాట్లాడుతూ మండల మహిళా మార్ట్ ఏర్పాటు గురించి సభ్యుల ఆర్థిక ఆదాయ జీవనోపాధి ప్రణాళిక సర్వే తదితర విషయాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీసీలను పని విధానంపై సమీక్ష చేయడం జరిగిందని తెలిపారు.

'క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు'



క్రీడాకారిణులతో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కడప స్పోర్ట్స్ నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని విశ్రాంత స్టెప్ సీఈఓ డాక్టర్ రామచంద్రారెడ్డి యువ క్రీడాకారులకు సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఆధ్వర్యంలో శనివారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు జరిగాయి. ఆయన ఔత్సాహిక మహిళా, పురుష క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేలా 2 శాతం వున్న రిజర్వేషన్లను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారుడూ వారు ఎంచుకున్న క్రీడా విభాగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ సెక్రటరీ శ్రీవాణి, డీఎస్‌ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, పీడీ సుబ్బన్న, లక్ష్మీశ్రీనాథ్, సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

ఆకట్టుకుంటున్న వజ్రాభరణాల ప్రదర్శన



వజ్రాభరణాలను తిలకిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో బుశెట్టి డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. శనివారం ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల ఆభరణాలను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వజ్రాభరణాలను అందించడానికి మూడోసారి వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.6 వేల నుంచి రూ.25 లక్షలు విలువైన వీవీఎస్‌ఈఎఫ్‌ఐజీఐ డైమండ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముక్కుపుడక, చైన్లు, కమ్మలు, ఉంగరాలు, నల్లపూసల దండలు, గాజులు వంటి ఆభరణాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఆదివారం కూడా ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఆర్ట్‌క్యాంపు మెంటార్‌గా మృత్యుంజయరావు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంబైలోని ప్రతిష్టాత్మకమైన కోఫియో క్యామ్‌లిన్ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ పెయింటింగ్ క్యాంపునకు తెలుగు రాష్ట్రాల తరపున మెంటార్‌గా వైవీయూ లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ మృత్యుంజయరావు ఎంపికయ్యారు. ఈ మేరకు క్యామ్‌లిన్ ఫౌండేషన్ నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ నెల 25 నుంచి 30 వరకు కర్ణాటక రాష్ట్రం హంపిలో ఉన్న హంపీ యూనివర్శిటీ క్యాంపస్‌లో ఈ శిబిరం జరగనుంది. దక్షిణ భారతదేశంలోని ఫైన్‌ఆర్ట్స్ కాలేజీల నుంచి ఎంపిక చేయబడిన దాదాపు 80మంది యువ చిత్రకారులు పాల్గొననున్నారు.

రెవెన్యూ అనుమతులతో మట్టి తవ్వుకోవాలి



ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వుతున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల అనుమతులతో మట్టితోలకాలు జరగాలని తహసీల్దారు దామోదరరెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠం తోట్లపల్లె సమీప కొండ ప్రాంతంలో కొందరు అనుమతులు లేకుండా మట్టిని తోలుకుంటున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాల స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. రాబోయే రోజుల్లో కూడా మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణసభ నేడు

కడప నాగరాజుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేనత కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణ సభను నిర్వహించనున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల తాలుకా లింగాల వాసి లింగమూర్తి విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారని, రైతుసంఘాల తొలితరం నేతలైన గజ్జల మల్లారెడ్డి, తోట వెంకటరెడ్డి, కేవీ నాగిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి శివరామిరెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. 60 ఏళ్లు ఎర్రజెండా నీడలో పనిచేసిన కామ్రేడ్ లింగమూర్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఈ సభకు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి : ఆర్డీఓ

బద్వేలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీ లోని పురపాలక సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో భూముల అన్యాక్రాంతం అధికమైందని వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు, హౌసింగ్ లే అవుట్ స్థలాల అడ్డుకట్టకు ప్రతి అధికారి నిబద్ధతతో కృషిచేయాలన్నారు. ఈ ఆక్రమణలు రోడ్డు మధ్య ముందుకు రేకులు వేయడం లాంటి ఆక్రమణలు అధికమవుతున్నాయని అలాంటి వాటిని గుర్తించి చట్టపర చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీవశాస్త్ర అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర అధ్యాపకులకు కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో 26న ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ వై.మీనాక్షి పేర్కొన్నారు. జంతు శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో బీబీసీ శార్ప్‌స్టేటస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అట్లూరు, బద్వేలు, సీకేదిన్నె, చెన్నూరు, గోపవరం, కమలాపురం, ఖాజీపేట, సిద్దవటం, వల్లూరు, ఒంటిమిట్ట మండలాల్లోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె శనివారం ఒక ప్రకటనలో కోరారు.

చోరీ కేసులో 8 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ఎరువుల గోడౌన్‌లో ఎరువులు, రసాయన మందులు చోరీ చేసిన 8 మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడపకు చెందిన ఉపేంద్ర, దిలీప్, రాజశేఖర్, సాయి, రాజేశ్, నరసింహ, సతీష్, చైతన్య ఈ నెల 20న రాత్రి గోడౌన్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న ఎరువులు సంబంధిత రసాయనిక మందులు చోరీ చేసినట్లు తెలి పారు. గోడౌన్ యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ సీతారామిరెడ్డి ఆదేశాలపై శనివారం నిందితులను అరెస్టు చేసి లక్ష రూపాయలు విలువైన ఎరువులు, రసాయన మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించలేదంటూ ఫిర్యాదు



చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నమాచుపల్లెకు చెందిన మారెళ్ల పూజ (16) 22వతేదీ శుక్రవారం నుంచి కనిపించలేదంటూ బాలిక తండ్రి మారెళ్ల రాజా శనివారం చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూతురును రెండురోజుల కిందట మందలించడంతో ఆమె ఇంట్లో చెప్పకుండా శుక్రవారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కడపలో మహిళ....

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన మహిళ అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు సరోజినీనగర్‌కు చెందిన మేరీ సుజాత నెల 13న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. బంధువులు ఇళ్లల్లో విచారించగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ పోటీలకు వీరేశ్ ఎంపిక

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన వీరేశ్ ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 25 నుంచి 29వరకు ఉత్తరప్రదేశ్‌లోని అలిగఢ్‌లో జరిగే 43వ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, వీరేశ్ అభినందించారు.

యువ ఉత్సవ్ పోటీలకు ఆహ్వానం

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ యువతకు పిలుపునిచ్చారు. రాయచోటిలోని భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల చివరి వారంలో యువ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ఇండియా అండ్-2047' అంశంపై పెయింటింగ్, కవిత్వం, వ్యాసరచన, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లమేషన్, ఫోక్ డాన్స్ (గ్రూప్) విభాగాల్లో వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తారని, ఆయా స్థాయిల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. అన్నమయ్య జిల్లాలో 15 నుంచి 29 ఏళ్ల లోపున్న యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. వివరాలకు స్టెప్ మేనేజర్ 9949298810, 8008819556 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పక్కాగృహంలో ఎర్రచందనం దుంగలు

ముద్దనూరు నవంబరు23(ఆంధ్రజ్యోతి): కొండప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన ప్రభుత్వ పక్కాగృహంలో నిల్వ చేసిన ఎర్రచందనం దుంగలను శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ అశోక్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దనూరు పాతవీధిలోనున్న మల్లేశ్వరికి చెందిన నిర్మాణంలో నున్న ప్రభుత్వ పక్కాగృహంలో 32 ఎర్రచందనం దుంగలు నిల్వ చేసి ఉన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఇక్కడ దుంగలు ఉన్నట్లు తెలిసింది. దీంతో సీక్రెట్ ఆపరేషన్‌లో భాగంగా టాస్క్‌ఫోర్సు అధికారులు తెల్లవారుజామున దాడి చేసి స్వాధీనం చేసుకుని, దుంగలను తిరుపతికి తరలించారు. రెండు రోజుల్లో కేసు ముద్దనూరు అటవీ రేంజ్‌కి బదిలీ చేస్తారని తెలిపారు.

ఆయుర్వేద దుకాణంపై విజిలెన్స్ తనిఖీ



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్‌ఆర్వో మురళీక్రిష్ణ,

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గుంతబజారులోని ఆరోగ్యరక్ష ఆయుర్వేద మందులషాపుపై శనివారం విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. వైద్య అర్హతలు లేకుండా పేషంట్లకు ఆయుర్వేద మందులను ఇస్తున్నట్లు గుర్తించామని అనుమతులు లేకుండా తైలాలు తయారు చేసి స్టిక్కర్లు అతికించిన వాటిని సీజ్ చేశారు. ఎఫ్‌ఆర్వో మురళీక్రిష్ణ, మెడికల్ ఆఫీసరు రిమ్స్ డాక్టర్ ఎస్.మురళీబాబు పాల్గొన్నారు.

దోమలను నిర్మూలిద్దాం



నీటి తొట్టిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పెండ్లిమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు పాటిస్తూ దోమల నివారణకు సహకరించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చౌటపల్లె గ్రామంలో డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వర పీడితులను పరామర్శించారు. ప్రతి శుక్రవారం ఇంట్లో ఉన్న తొట్లు, బానలు, కూలర్లు, టైర్లు శుభ్రం చేయాలన్నారు. దోమతెరలు వాడాలని, సాయంత్రం పూట వేపాకుతో పొగవేసుకోవాలని సూచించారు. నీళ్లు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసుకోవాలని సలహా ఇచ్చారు. ఫీవర్ సర్వే నిర్వహించి లార్వా సర్వే చేయించి జ్వర లక్షణాలు ఉన్న వారి రక్తనమూనాలు సేకరించి రిమ్స్ ఆసుపత్రికి పంపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజీర్, పంచాయతీ కార్యదర్శి గంగులయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, ఎంపీహెచ్‌ఈఓ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో 25న సైన్స్ అండ్ టెక్నాలజీ అధునాతన మెటీరియల్‌పై జాతీయ సదస్సు ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఆర్జేడీ డాక్టర్ గిరి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

చిరు వ్యాపారిపై ఎస్ఐ దాడి

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మృత్యుంజయకుంట వద్ద బజ్జీల బండి నిర్వహిస్తున్న ఓ చిరు వ్యాపారిపై ఎస్ఐ దాడి చేశారు. రోడ్డుపై అడ్డంగా బండి పెట్టాడంటూ ఆ చిరు వ్యాపారి షేక్ మాస్తాన్‌ను ఎస్ఐ లాఠీతో కొట్టడంతో అక్కడే పడిపోయాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం 108లో కడప సర్వజన ఆస్పత్రికి తరలించారు.



యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సీకేదిన్నె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త వీరయ్య తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోటెక్ కిసాన్ హబ్ పథకంలో భాగంగా వేరుశనగలో అధిక ఉత్పాదకతను పెంచడం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం రైతులకు విశిష్ట రకమైన టీసీజీఎస్ 1694 విత్తనాన్ని పంపిణీ చేశామన్నారు. ఈ రకం ఆకుమచ్చ తెగుళ్లకు తట్టుకుంటుందన్నారు. పంట ఎత్తుగా పెరగకుండా ఎక్కువ కొమ్మలు, ఊడలు ఏర్పడి కాయలు కూడా అధికంగా వస్తాయన్నారు. వర్షాధారంగా 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బయోటెక్ కిసాన్ హబ్ నిపుణుడు గిరీష్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయిమహేశ్వరి, మానస, మహేష్‌బాబు, సురేష్‌కుమార్‌రెడ్డి రైతులకు పంట దిగుబడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో పైరిత్రం పిచికారీ

వేముల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేముల సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో దోమల నివారణ కోసం పైరిత్రం పిచికారీ చేశారు. శనివారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో పిచికారీ చేశారు, దోమల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ జబీవుల్లా, సూపర్వైజర్లు విజయలక్ష్మి, రమేష్, ఆరోగ్య కార్యకర్త అశ్వని, ఆశాకార్యకర్త పద్మావతమ్మ పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



చెన్నూరు హైవే రోడ్డు నుంచి బుడ్డాయపల్లెకు వెళ్లే దారిలో ఉన్న ఆంజనేయస్వామి గుడి ముందు మురుగునీరు నిల్వచేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఇదివరకు గుడికి పైభాగంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొంతవరకు కాంక్రీటుతో కాల్వ ఏర్పాటు చేశారు. ఇక మిగలిన కాల్వ ఏర్పాటు చేయడంతో పాటు మోరీ కడితే తప్ప కాల్వలో ఉన్న మురికి నీరంతా బయటికి వెళ్లే మార్గం లేదు.

-చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

దత్తత కార్యక్రమం ఓ వరం



దత్తత మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సునీత

వీరపునాయునిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని వారు పిల్లలు పొందడానికి దత్తత కార్యక్రమం ఓ వరంలాంటిదని ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత అన్నారు. శనివారం వీరపునాయునిపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి శ్రీలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ దత్తత కార్యక్రమం ద్వారా బిడ్డలను పొందే వరాన్ని ప్రభుత్వం అందించడం సంతోషమన్నారు. ఈ దత్తత అనేది సీఏఆర్ఏ నియమనిబంధనల ప్రకారం దత్తత తీసుకోవాలని తెలిపారు. అనంతరం 1098 అందిస్తున్న సేవలు, సోషల్ మీడియా ప్రభావం, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సోషల్ వర్కర్ విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

'జిల్లా సైనికాధికారి సేవలు మరువలేనివి'

కడప(వినాయకనగర్),నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా సైనిక సంక్షేమ అధికారి రఘురామయ్య సేవలు మరువలేనివని ఆ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సైనికాధికారిగా మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

పుష్పగిరి రోడ్డు వెంబడి మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న వనసంరక్షణ సమితి సభ్యులు

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, నీడ, పచ్చదనం కోసం పుష్పగిరి రోడ్డు వెంబడి మొక్కల పెంపకం చేపట్టారు. వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో డీఎఫ్ఓ నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు శనివారం ఎఫ్ఆర్వో మద్దిలేటి పుష్పగిరి రోడ్డు వెంబడి సుమారు 2వేల మొక్కలు నాటించారు. రావి, షెల్టోఫారం, నేరేడు, వేప, కానుగ, నిద్రగన్నేరు లాంటి మొక్కలను రోడ్డుకిరువైపులా నాటిస్తున్నారు. గత ఏడాది రూ.9 కోట్లతో హైవే రహదారి ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు నుంచి పుష్పగిరి వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. వీఎస్ఎస్ అధ్యక్షుడు గంగయ్య ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



సీఎం సహాయ నిధి పొందిన వారితో ఎమ్మెల్సీ

పులివెందుల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పరిధిలోకి రాని వైద్య సేవలు పొందిన పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. రూ.11.15లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు శనివారం ఎమ్మెల్సీ అందించారు. కాంబల్లెకు చెందిన వర్షినిరెడ్డికి రూ.8.34లక్షలు, బూచుపల్లెకు చెందిన లక్ష్మీదేవికి రూ.1.00 లక్ష, అగడూరుకు చెందిన గంగిరెడ్డికి రూ.62,038, సుంకేసులకు చెందిన శ్వేతకు రూ.60వేలు, ఉలిమెల్లకు చెందిన వెంకటశివకు రూ.52,809, రాధాకు రూ.7వేలు చెక్కులను అందించారు.

26న కడపలో జరిగే ధర్నాను జయప్రదం చేయండి

వేంపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 26న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా నాయకులు సుబ్బరాయుడు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుంచి విడుదల చేయాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు అలాగే పంటరుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200రోజుల పనిదినాలను కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. ఇంకా అనేక డిమాండ్లతో తలపెట్టిన ధర్నాలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొనాలన్నారు.

ఎమ్మెల్సీని సత్కరించిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు

పులివెందుల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సక్షేమ వసతి గృహాల మరమ్మతులకు కోటి రూపాయలు కేటాయింపునకు కృషిచేసిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సత్కరించారు.ఇటీవల శాసనమండలిలో హాస్టళ్ల బాగోగుల విషయాన్ని ఎమ్మెల్సీ సభ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి మరమ్మతులకు నిధులు కేటాయింపునకు అంగీకరించారు. శనివారం ఎమ్మెల్సీ ఇంటి వద్ద ఆయన్ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తొగటవీర క్షత్రియుల వనభోజనం



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాసుధాకర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనుమలోపల్లి 108 శివలింగాల మహాలింగేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం తొగటవీర క్షత్రియుల కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యాసుధాకర్, పల్లా నరసింహారావు తెలిపారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కదిరి శాసనసభ్యుడు వెంకటప్రసాద్, రాష్ట్ర, జిల్లాల సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథుల సందేశం, పవిత్ర వనభోజన ప్రసాదం స్వీకరణ తరువాత నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. అలాగే మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కావున కుటుంబ సమేతంగా హాజరై వనభోజనంలో పాల్గొని ఈశ్వర కటాక్షం పొందాలని ఆకాంక్షించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, కోశాధికారి సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లా మురళీక్రిష్ణయ్య, ఉపాధ్యక్షులు సూరిబాబు, వెంకటస్వామి, దొడ్ల వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

26న ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 26న కిశోర వికాసంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 నుంచి 19 సంవత్సరాల్లోపు బాలబాలికల సంరక్షణకు చేపట్టవలసిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించామన్నారు. ముఖ్యంగా పోక్సో చట్టం, ఆరోగ్యం, బాల్యవివాహాల నివారణ, హ్యూమన్ ట్రాకింగ్, పరిసరాల పరిశుభ్రత, యోగా, పౌష్టికాహారం, అక్రమ రవాణా, జీవనోపాధులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. శిక్షణ పొందిన అధికారులు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కాగా సంబంధిత శాఖల అధికారులు 26న జరిగే సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు. ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, వైద్యాధికారి చెన్నారెడ్డి, ఎంఈవో గంగిరెడ్డి, ఏపీఎం వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సికెదిన్నె: చింతకొమ్మదిన్నె ఎంపీడీవో కార్యాలయంలో 26న శిక్షణ ఉంటుందని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. కిశోరి వికాసం కార్యక్రమంపై ఉదయం 10.30 గంటలకు మహిళా పోలీసు, సోషియల్ వెల్ఫేర్ సహాయకులు, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణ ఉంటుందన్నారు.

క్రీడాకారిణికి ట్రాక్ షూ బహూకరణ

పులివెందుల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని మానసకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి శనివారం ట్రాక్ షూ బహూకరించారు. మానస వరుసగా రెండోసారి విశ్వవిద్యాలయం మహిళాల కబడ్డీ జట్టులో స్థానం సంపాదించి ఈ నెల 28, 29 తేదీల్లో తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో జరగనున్న దక్షిణ భారతదేశ విశ్వవిద్యాలయ కబడ్డీ మహిళల పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఎమ్మెల్సీని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, చరిత్ర శాఖ అధ్యాపకులు గంగాధర్, ఆంగ్ల అధ్యాపకులు అరవింద్, ఫిజికల్ డైరెక్టరు తేజేంద్ర విద్యార్థినిని అభినందించారు.

'హామీలను మభ్యపెట్టేందుకే తప్పుడు ఆరోపణలు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను మభ్యపెట్టేందుకే కూటమి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఒప్పందం కేంద్ర ప్రభుత్వ సెకీతో చేసుకున్నది తప్ప ఆదాని కంపెనీలతో కాదన్నారు. కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసలు అదాని గ్రూపుతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకోలేదన్నారు. 2021 జనవరిలో కేంద్రం ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్‌చార్జీలు రద్దు చేసిందన్నారు. ఆ తరువాతే జగన్ ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకుందన్నారు. రూ.2.30 పైసలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, ఇలియాస్, త్యాగరాజు, రామక్రిష్ణరెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పెండ్లిమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ వెయ్యినూతుల కోన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సీసీ రోడ్డు పనులను చెర్లోపల్లె సర్పంచు సంగటి గంగిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధుల నుంచి రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

భూ వివాదాలు లేకుండా చూస్తా: తహసీల్దార్



మహ్మద్ నజీర్, తహసీల్దారు, పులివెందుల

పులివెందులటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూవివాదాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తహసీల్దారు మహ్మద్ నజీర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ వివరాలు ఇవీ...

ప్రశ్న: రైతులు మీ దృష్టికి ఎటువంటి సమస్యలు తీసుకువస్తున్నారు.

జవాబు: ఆన్‌లైన్ రికార్డుల్లో తమ భూమి వివరాలు పూర్తిస్థాయిలో నమోదు కాలేదని తెలుపుతున్నారు.

ప్రశ్న: ఆన్‌లైన్ కాని భూ సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు.

జవాబు: రైతుల వద్ద సాగు భూమికి సంబంధించిన వివరాల డాక్యుమెంట్లను పరిశీలిస్తాం. ఆర్ఐ విచారణ చేస్తారు. అనంతరం ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

ప్రశ్న: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు ఎలా పరిష్కరిస్తున్నారు.

జవాబు: ప్రాధాన్యతాక్రమంలో సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తున్నాం. నిర్ణీత సమయంలోపే పరిష్కరిస్తాం.

ప్రశ్న: రెవెన్యూ గ్రామసభలకు రైతుల నుంచి స్పందన ఉందా?

జవాబు: రైతుల నుంచి మంచి స్పందన లభించింది. సమస్యల పరిష్కారానికి రైతులు అధిక సంఖ్యలో అర్జీలు పెట్టుకున్నారు.

ప్రశ్న: రైతుల నుంచి ఏ విధమైన సమస్యలు ఎక్కువగా వచ్చాయి?

జవాబు: ఆన్‌లైన్‌లో భూములు నమోదు కాకపోవడం, డీఎల్ఆర్‌లో చూపించకపోవడం, ఎల్‌పీఎం బేస్‌లో ఇద్దరి భూములు ఒకరి కిందనే చూపించడం, కాల్వల కింద భూముల రిజిస్ట్రేషన్ ఎక్కువగా నమోదు అయ్యాయి.

ప్రశ్న: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ప్రభుత్వ భూములు, స్థలాల ఆక్రమణలు పూర్తిగా తొలగిస్తాం. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: 22ఏ జాబితాలో చేరిన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారు.

జవాబు: హక్కు ఉన్న భూములు 22ఏ జాబితాలో ఎలా చేరాయో తెలియదు. వాటిపై ఫైలు తయారు చేస్తాం. కలెక్టరుకు నివేదించి ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.

ప్రశ్న: రేషన్ మాఫియా పులివెందులలో పెరిగిందని ఆరోపనలున్నాయి., వాటిపై మీరు ఏ చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: రేషన్‌డీలర్లకు ఎండీయూ ఆపరేటర్లతో నెలలో కనీసం రెండు సార్లు సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. నిబంధనలు పాటించాలని సూచనలు చెబుతన్నాం. తనిఖీలు కూడా చేస్త అవినీతికి పాల్పడేవారిపై చర్యలు చేపడతాం. ప్రస్తుతం అదుపులోకి వచ్చింది.

ప్రశ్న: కార్డుదారులకు మీరు ఏం చెప్పాలనుకుంటున్నారు?

జవాబు: ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశ్యంతో రూ.46కు కేజీ బియ్యం కొనుగోలు చేస్తుంది. తెల్లరేషన్‌కార్డు ద్వారా కేజీ రూపాయికి అందిస్తూ వారికి అండగా నిలుస్తుంది. అపోహలు వీడి వాటిని వినియోగించుకోవాలి.

ప్రశ్న: ఇటీవల రేషన్ బియ్యం పెద్ద మొత్తంలో పట్టుబడడానికి కారణం

జవాబు: గ్రామాల్లో బియ్యంపై రేషన్ మాఫియా అనుమానం పెంచి వాటిని కిలో రూ.15 నుంచి 20 చెల్లించి నల్లబజారుకు తరలిస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. పేదలు నష్టపోతున్నారు. దళారులు మాత్రం కోటీశ్వరులుగా మారుతున్నారు.

'ఏపీజీబీ కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమం'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. ఈ మేరకు సీఎం నారా చంద్రబాబునాయుడికి బహిరంగ లేఖలో వివరించారు. కూటమి పాలనలో రాయలసీమలో ఒక్క పరిశ్రమ లేదా సంస్థ ఏర్పాటు చేయకపోగా ఉన్న వాటిని కూడా తరలిస్తే ఎలా అని ప్రశ్నించారు. కడప కొప్పర్తిలో ఎంఎస్ఎం ఈ టెక్నాలజీ సెంటరును మంగళగిరికి తీసుకుపోవడం, పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన 50 సీట్ల భర్తీని రద్దు చేయించడం, కడప నగరపాలక సంస్థ కమిషనరుగా ఉన్న ఐఏఎస్‌ను సీఆర్‌డీఏకు తీసుకుపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఏపీజీబీ కార్యాలయాన్ని కూడా అమరావతికి తరలించాన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నారా చంద్రబాబు ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం కమలాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, లేదంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా సామూహిక సత్యసాయి వ్రతం

వేంపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో షిర్డీసాయి బాబా ఆలయంలో సామూహిక సత్యసాయ వ్రతం ఘనంగా నిర్వహించారు. శనివారం సత్యసాయి 99వ జన్మదినోత్సం సందర్భంగా ఉద యం నగర సంకీర్తన నిర్వహించారు. సామూహిక వ్రతం అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సుమారు 400 మంది భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా సేవలు వెలకట్టలేనివి

కడప కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా సేవలు వెలకట్టలేనివని జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ జి. లక్ష్మీరెడ్డి కొనియాడారు. శనివారం సత్యసాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబా చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.

వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మానవతా విలువలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి తెలిపారు.బహుమతులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

● ఆర్డీవో చంద్రమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీలోని పురపాలక సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజనలో భూముల అన్యాక్రాంతం అధికమైందని వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. అలాగే ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు, హౌసింగ్ లే అవుట్ స్థలాల అడ్డుకట్టకు ప్రతి అధికారి నిబద్ధతతో కృషిచేయాలన్నారు. ఈ ఆక్రమణలు రోడ్డు మధ్య, ముందుకు రేకులు వేయడం లాంటి ఆక్రమణలు అధికమవుతున్నాయని అలాంటి వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ నాయకులు జైలుకు వెళ్లడం ఖాయం'

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల పాపాల చిట్టా విప్పితే ఆ పార్టీ నాయకులు జైలుకు వెళ్లడం ఖాయమని టీడీపీ నాయకుడు పగిడాల దస్తగిరి పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి ఆరుసార్లు ఎన్నికల్లో గెలిచిన వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మున్సిపల్ సర్వేయర్ రూ.5 వేలు అవినీతికి పాల్పడితే ఎమ్మెల్యే, తెలుగుదేశం ప్రభుత్వానికి ఆపాదించడం తగదన్నారు. మున్సిపాలిటీలో మీ పాలనే ఉందని, ఆ సర్వేయర్ అవినీతి మీకు తెలియదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందని, అధికారులను ఇళ్ల వద్దకు పిలిపించుకుని నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించుకున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్ నెంబరు 765గా నమోదు అయిన బంగారురెడ్డి ఎమ్మెల్యే, కొండారెడ్డిపైన విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేశవరెడ్డి, బాబు, శంకర్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలయి బిల్లులు చెల్లించి అప్పుల పాలయిన బాధితులకు సహాయార్థంగా ముఖ్యమంత్రిసహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయడం వాటిని పారదర్శకంగా అందజేయడం జరుగుతోందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో 23 మందికి 25.66 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు బకాయిలు చెల్లించటం లేదు



మంత్రి లోకేష్‌బాబుతో మాట్లాడుతున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలకు చెల్లించాల్సిన లేఅవుట్ ఫీజులతో పాటు ఇతర కట్టడాల అనుమతుల ఫీజులు కడప అర్బన్‌డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) సక్రమంగా చెల్లించడం లేదని జిల్లా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను శివచంద్రా రెడ్డి కలిశారు. కొత్తపల్లె పంచాయతీకి కుడా లేఅవుట్ ఫీజులతో పాటు భవన నిర్మాణ అనుమతుల ఫీజులు దాదాపు 1.25 కోట్ల రూపాయలు బకాయిలుందని సత్వరం చెల్లించేలా ఆదేశాలివ్వాలని శివచంద్రారెడ్డి లోకేశ్‌ను కోరారు. అలాగే పంచాయతీ అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరు చేయాలని పంచాయితీ రాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు సర్పంచ్ శివచంద్రారెడ్డి తెలిపారు.

ఘనంగా కాలభైరవస్వామి జయంతి



అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో శనివారం కాలభైరవస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలభైరవస్వామి చిత్రపటానికి, విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలభైరవ స్వామి ఉపాసకుడు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వినియోగం చేశారు. ఉచితంగా పంచముఖి రుద్రాక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, చక్రపాణి, పెద్దమల్లికార్జున, మల్లి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ నీటిని సద్వినియోగం చేసుకోండి



నీటిని విడుదల చేస్తున్న నేతలు

పోరుమామిళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగగంగ నీటిని సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ యువ నేత రితీశ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పోరుమామిళ్ల మండలంలోని కొండుగారిపల్లె వద్ద కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ ఆయకట్టు పరిధిలోని రైతులం తా నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి, కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి, సీతా వెంకటసుబ్బయ్య, సెట్టెం ప్రతాప్, సామిరెడ్డి, తెలుగుంగ ఇంజనీరింగ్ అధికారులు,టీడీపీ నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

పోరుమామిళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ కమిటీ కన్వీనరు సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శనివారం పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి 15 నెలలు కావస్తున్నా ఇంత వరకు 12వ వేతన సవరణ ఊసే లేకుండాపోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలరు చంద్రహాసరెడ్డి, సీనియర్ నాయకులు బాలరాజు, కస్తూరి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గసభ్యులు పుల్లారెడ్డి, గురయ్య వెంకట్రామయ్య,రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, అబ్దుల్ హసేన్ పాల్గొన్నారు.

కేసుల రాజీకి ఇష్టపూర్వకంగా ఒప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు వివిధ కేసుల కక్షిదారులతో మాట్లాడి ఇష్టపూర్వకంగా రాజీ చేసుకునేలా ఒప్పించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం ఉదయం 11 గంటలకు కోర్టు ప్రాంగణంలో జడ్జి అధ్యక్షతన పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులకు, న్యాయవాదులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిసెంబరు 14వ తేదీ జాతీయ లోక్ అదాలత్ (మెగా) ఉంటుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పోలీసు అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు గోపాల్‌రెడ్డి, కె.దస్తగిరి, మహమ్మద్‌రఫి, నరేష్, ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, విద్యాసాగర్, రుషికేశవరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శక్తివంతమైన రాజకీయ పార్టీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి



ఎర్రగుంట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేవలం రెండు నెలల్లో 11కోట్ల బీజేపీ సభ్యత్వం చేసి ప్రపంచంలోనే బీజేపీ శక్తివంతమైన అతిపెద్ద రాజకీయపార్టీగా ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరక్టర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎర్రగుంట్ల ఎన్డీయే కూటమి కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి రావడంపై మండల ఎన్డీయే ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, నాయకులతో కలిసి కేక్ కట్ చేసి విజయోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలను కూడా తోసిపుచ్చలేమని కార్యకర్తలంతా అలర్ట్‌గా ఉండాలని పిలుపునిచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడైతే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.ఈ కార్యక్రమల ఎంపీటీసీ నవీన్‌కుమార్, బీజేపీ, ఎన్డీయే నాయకులు బంగార్‌రెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి, సత్యంస్వామి, నాగరాజు, మల్లుగోపాల్‌రెడ్డి, హరిఓబుళరెడ్డి, కలమల్ల బాబు, సర్పంచ్ వాసుదేవరెడ్డి, జంగంరెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయండి : ఎన్‌హెచ్‌కు భూములు కోల్పోతున్న రైతులు

చాగలమర్రి-రాయచోటి ఎన్‌హెచ్ హైవేకి భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిని కోరారు. శనివారం రాత్రి ఎర్రగుంట్లలోని ఎన్డీయే కార్యాలయంలో రైతులు, బీజేపీ నాయకులు కత్తిప్రతాప్‌రెడ్డి, నాగరాజు వినతి పత్రాన్ని ఇచ్చారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

చాపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించాలని చాపాడు చానెల్ ఏఈ గురుమోహన్, తహసీల్దారు రమాకుమారి కోరారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో శనివారం ఈ ఎన్నికలకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురుమోహన్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు168 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. డిశంబరు 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు రైతులు నామినేషన్లు వేయాలన్నారు. మధ్యాహ్నం రైతులు చేతులెత్తి నీటి సంఘాలకు ప్రెసిడెంట్లు, వైస్‌ప్రెసిడెంట్లను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. మొత్తం 7 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక సంఘానికి 12 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సాగునీటి సంఘాలు చియ్యపాడు, సోమాపురం, అల్లాడుపల్లెలో ఒకటేసి చొప్పున, మదూరు, అనంతపురంలలో రెండేసి చొప్పున ఉన్నాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పక్కాగృహంలో ఎర్రచందనం దుంగలు

ముద్దనూరు నవంబరు23(ఆంధ్రజ్యోతి): కొండప్రాతంలో లబ్ధిదారులకు కేటాయించిన ప్రభుత్వ పక్కాగృహంలో నిల్వ చేసిన ఎర్రచందనం దుంగలను శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి టాస్కఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ అశోక్ కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దనూరు పాతవీధిలోనున్న మల్లేశ్వరికి చెందిన నిర్మాణంలో నున్న ప్రభుత్వ పక్కాగృహంలో 32 ఎర్రచందనం దుంగలు నిల్వ చేసి ఉన్నారు. తిరుపతి టాస్కఫోర్సు అధికారులు వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఇక్కడ దుంగలు ఉన్నట్లు తెలింది. దీంతో సీక్రెట్ ఆపరేషన్‌లో భాగంగా టాస్కఫోర్సు అధికారులు తెల్లవారుజామున దాడి చేసి స్వాధీనం చేసుకుని, దుంగలను తిరుపతికి తరలించారు. రెండు రోజుల్లో కేసు ముద్దనూరు అటవీ రేంజ్‌కి బదిలీ చేస్తారని తెలిపారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

పోరుమామిళ్లనవంబరు23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సంద ర్భంగా అరుణాచలానికి బస్సు సౌకర్యం కలగజేస్తున్నట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం తెలి పారు. ఆదివారం రాత్రి 7గంటలకు పోరుమామిళ్ల నుంచి నేరుగా అరుణాచలానికి బస్సు వెళుతుందని సోమవారం ఉదయం 5గంటలాకల్ల అరుణాచలం చేరి గిరిప్ర దక్షిణ చేసిన తరువాత గోల్డెన్ టెంపుల్ కూడా సందర్శించవచ్చని తెలిపారు. అరుణా చలానికి వెళ్లేవారు 7981554538, 7382865220కి ఫోను చేయాలన్నారు. టికెట్ ఫోను ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఒక టికెట్‌కు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రెవెన్యూ అనుమతులతో మట్టి తవ్వుకోవాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల అనుమతులతో మట్టితోలకాలు జరగాలని తహసీల్దారు దామోదరరెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠం తోట్లపల్లె సమీప కొండ ప్రాంతంలో కొందరు అనుమతులు లేకుండా మట్టిని తోలుకుంటున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాల స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. రాబోయే రోజుల్లో కూడా మండ లంలో ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

కనులపండువగా కోటి దీపోత్సవం



బద్వేలు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగో శనివారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కనులపండువగా కోటీ దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా స్వామివారికి అభిషేకం, అనంతరం కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి దీపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహార ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలను సొంతంగా తొలగించండి



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

బద్వేలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మీదకు అక్రమ నిర్మాణాలు చేపట్టడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని , తక్షణమే వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కోరారు. శనివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పోలీసు సిబ్బంది ద్వారా కొన్ని తొలగించామని మిగిలిన వారు స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న అక్రమ నిర్మాణాలు, షాపులకు ఉన్న రేకులు ముందుకు రావడం లాంటి వాటిని తొలగిస్తామన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ కుళాయి అక్రమ కనెక్షన్‌లను రెగ్యులర్ చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సతీష్ పాల్గొన్నారు.

స్పెషల్‌డ్రైవ్ ను సద్వినియోగం చేసుకోండి

కొండాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల స్పెషల్‌డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గురప్ప తెలిపారు.మండలంలోని అన్ని పోలింగ్ బూతుల వద్ద ఆదివారం కూడా బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటు నమోదు, మార్పులు, చేర్పులు చేసుకొనేందుకు మంచి అవకాశమని తహసీల్దార్ గురప్ప తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ స్థలాన్ని బంజరు భూమి, వంకలను రెవెన్యూ అధికారుల ఆదేశాలు లేనిదే కట్టడాలు కానీ ఆక్రమణలు కానీ చేయవద్దని తహసీల్దారు దామోదరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థానం వంక పక్కన ఉన్న ఖాళీస్థలంలో దేవస్థానం వారు మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండగా, రెవెన్యూ అధికారులు నిలిపి చేశారు.ఈ మేరకు కొలతలు వేసిన తరువాత స్థలం ఎవరికైతే సర్వేలో తేలుతుందో ఆ తరువాత మొక్కలు నాటుకోవాలని దేవస్థానం యాజమాన్యానికి తహసీల్దారు దామోదర్‌రెడ్డి తెలిపారు.

ఆకట్టుకుంటున్న వజ్రాభరణాల ప్రదర్శన


వజ్రాభరణాలను చూస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వసంతపేటలోని బుశెట్టి కల్యాణ మండపంలో బుశెట్టి డైమండ్ జువెలరీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. శనివారం ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల ఆభరణాలను ప్రదర్శించారు. సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వజ్రాభరణాలను అందించడానికి మూడోసారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.6 వేల నుంచి రూ.25 లక్షల విలువైన వీవీఎస్‌ఈఎఫ్‌ఐజీవి డైమండ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముక్కుపుడక, చైన్లు, కమ్మలు, ఉంగరాలు, నల్లపూసల దండలు, గాజులు వంటి ఆభరణాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఆదివారం కూడా ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


ఎర్రగుంట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని వివిధ పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ శోభన్‌బాబు శనివారం పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలతో ఆయన మాట్లాడారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా 23, 24వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌వోలు తప్పనిసరిగా ఉండాలన్నారు. 18ఏళ్ల నిండిన యువత ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌వో లాగిన్‌లో తమ ఓటుకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఓటర్ల లిస్టులో ఏమైనా సవరణలు ఉంటే కూడా వాటిని సరిచేసుకోవచ్చన్నారు. ఎర్రగుంట్ల మండలంలో మొత్తం 79 పోలింగ్ బూతులున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అర్జున్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.























నేడు అయ్యప్పస్వామి లక్షార్చన

మైదుకూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో నంద్యాల రోడ్డులో నూతనంగా నిర్మితమౌతున్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి లక్షార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు శనివారం వేణుగోపాలస్వామి తెలిపారు. తెల్లవారు జాము నుంచే గణపతి పూజ నుంచి ప్రారంభమౌతుందని,లక్షార్చన పూజ, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయం త్రం గ్రామోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

శివభక్తేంద్ర స్వామి ఆరాధన...

మైదుకూరు రూరల్,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖాజీపేట మండలంలోని బంగ్లా వద్ద ఆదివారం శివభక్తేంద్ర స్వామి ఆరాధన మహోత్సవ, 30 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శివగాయత్రి స్వామి శనివారం తెలిపారు.తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు,అఖండ దీపం,పాలాభిషేకం,స్వామివారికి అలంకరణ తెలిపారు.మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపార

రేపు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మల్లేపల్లె పంచాయతీ చెంచయ్యగారిపల్లె గ్రామంలో ఈ నెల 25న అయ్యప్పస్వామి గ్రామోత్స వం పడిపూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వామి మాల ధారణ భక్తులు, గ్రామంలోని ప్రజలందరూ పూజా కార్యక్రమానికి హాజరు కావాలని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం, సాయంత్రం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు రూరల్,నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని రైతులు ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో లక్ష్మీప్రసన్న శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతులు దగ్గరలోని సచివాలయం,రైతు భరోస కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి బుడ్డశెనగ, మినుము,పెసర, నువ్వులు,వేరుశెనగ,జొన్న, పొద్దుతిరుగుడు పంటలకు డిసెంబరు 15, వరికి మాత్రం డిసెంబరు 31 వరకు గడువు ఉన్నట్లు ఆమె తెలిపారు.

